

ప్రభుత్వభూమిలో నిర్మించిన గెస్ట్‌హౌస్‌ను కూల్చివేస్తున్న రెవెన్యూఅధికారులు

గెస్ట్‌హౌస్ కూల్చి వేత

నిజాంపేట్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిలో నిర్మించిన ప్రైవేట్ గెస్ట్‌హౌస్‌ను రెవెన్యూ అధికారులు మంగళవారం కూల్చివేశారు. 'ప్రభుత్వ భూమిలో ప్రైవేటు గెస్ట్‌హౌస్' అనే శీర్షికన ఈనెల 9న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి వారం రోజుల తరువాత రెవెన్యూ అధికారులు స్పందించారు. తహసీల్దార్ పూల్‌సింగ్ ఆదేశాలు మేరకు ఆర్ఐ కవిత, రెవెన్యూ సిబ్బంది వచ్చి గెస్ట్‌హౌస్‌ను పూర్తిగా నేలమట్టం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పూల్‌సింగ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే భూకబ్జా కేసులు నమోదు చేసి నిర్మాణాలు కూల్చివేస్తామని హెచ్చరించారు.

పార్కు స్థలాలను కబ్జా చేస్తే క్రిమినల్ కేసులు



భవనాన్ని కూల్చివేస్తున్న అధికారులు

గాజులరామారం, జూలై 16(ఆంధ్రజ్యోతి): మహాదేవపురం కాలనీ పార్కుస్థలాలు, అంతర్గత రోడ్లను ఆక్రమించి నిర్మాణాలను చేపడుతున్న బిల్డర్‌పై చర్యలు తీసుకోవాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కమిషనర్ రంగనాథ్ జీహెచ్ఎంసీ అధికారులకు ఆదేశించారు. మహాదేవపురంకాలనీలో సర్వేనెంబర్లు 302, 303లోని 9 పార్కులు కబ్జాకు గురయ్యాయని అసోసియేషన్ సభ్యులు కోర్టుకు వెళ్లారు. ఈ క్రమంలో కాలనీ వార్డు ఆఫీసు రోడ్డులో పార్కు స్థలాన్ని ఆక్రమించి నిర్మిస్తున్న భవనంపై అసోసియేషన్ సభ్యులు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిషనర్ రంగనాథ్ మంగళవారం కాలనీలోని ఫేజ్-2లో పర్యటించి పార్కు స్థలంలో నిర్మిస్తున్న భవనాన్ని పరిశీలించారు. పార్కు స్థలంలో ఎందుకు నిర్మాణం చేస్తున్నారని బిల్డర్‌ను మందలించారు. కబ్జాదారులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయాలని జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. దీంతో స్పందించిన టౌన్‌ప్లానింగ్ అధి కారులు సిబ్బందితో కలిసి నిర్మాణాన్ని కూల్చివేస్తున్నారు.

పరికి చెరువు కబ్జాదారులపై కేసులు నమోదు చేయండి

జీడిమెట్ల, జూలై 16(ఆంధ్రజ్యోతి): జగద్గిరిగుట్ట భూదేవిహిల్స్ ప్రాంతంలోని పరికిచెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లలో నిర్మాణాలు చేపట్టేవారిపై కేసులు నమోదు చేయాలని జీహెచ్ఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కమిషనర్ ఏవీ రంగనాథ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మూసాపేట్, గాజులరామారం పరిధిలోని పలు సర్వేనెంబర్‌లలో ఉన్న పరికి చెరువును కొందరు కబ్జాచేసి నిర్మాణాలు సాగిస్తున్నారని కాంగ్రెస్, బీజేపీ నాయకులు రెవెన్యూ మంత్రికి, జీహెచ్ఎంసీ, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం రంగంలోకి దిగిన రంగనాథ్ భూదేవిహిల్స్ ప్రాంతంలో పర్యటించారు. ఇక్కడ సాగుతున్న అక్రమ నిర్మాణాలు, చెరువు కబ్జాలను గుర్తించారు. కబ్జాలకు పాల్పడే వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని, కేసులు నమోదు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

అధ్వానంగా బీహెచ్ఈఎల్ రోడ్లు

● అడుగడుగుకో గుంత.. వెలగని విద్యుత్ దీపాలు ● మరమ్మతులు చేపట్టని అధికారులు ● భెల్ ఎస్టేట్ అధికారులపై ప్రజల ఆగ్రహం

భెల్‌కాలనీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు.. కార్మికులు.. ఉద్యోగులు రాకపోకలతో నిత్యం రద్దీగా ఉండే బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్ - ఎంఐజీకాలనీ ప్రధాన రహదారి గుంతలతో ప్రమాదకరంగా మారింది. బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్ - ఎంఐజీకాలనీకి వెళ్లే రెండు ప్రధాన రహదారులపై భారీగా ఏర్పడ్డ గుంతలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతల్లో వర్షంనీరు నిలిచిపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్లు గుంతలు పడి ఏళ్లు గడుస్తున్నా టౌన్‌షిప్ ఎస్టేట్ అధికారులు మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రజలు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళ్లలో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది. ప్రధాన రహదారిపై విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో గుంతల రోడ్లపై ప్రయాణించేవారు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్తున్నారు. భెల్ పరిశ్రమలో పనిచేసే కార్మికులు, కాలనీలో చదివే విద్యార్థులు నిత్యం ఇదే రహదారిపై వెళ్తూ ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఎస్టేట్ అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.



గుంతలమయంగా మారిన ఎంఐజీకాలనీకి వెళ్లే ప్రధాన రహదారి



కేపీహెచ్‌బీలో అవగాహన ర్యాలీ

దోమల నివారణపై అవగాహన ర్యాలీ

కేపీహెచ్‌బీకాలనీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): దోమల నివారణ కోసం ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందని పీవో ఇంద్రసేన, అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ నగేష్ అన్నారు. మంగళవారం కేపీహెచ్‌బీ మూడో ఫేజ్‌లోని మహిళా మండలి భవనంలో గ్రూపుసభ్యులు, సీనియర్ సిటిజన్స్, సంక్షేమ సంఘాల ప్రతినిధులకు దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిసరాల పరిశుభ్రత, నీటి నిల్వ ఉండకుండా తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. అనంతరం కాలనీ వీధుల్లో దోమల నివారణపై ర్యాలీ నిర్వహించారు. సీవో సురేష్, ఎంటమాలజీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రహదారులను పరిశీలించిన జడ్‌సీ

గచ్చిబౌలి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రహదారుల పరిశుభ్రతపై క్షేత్రస్థాయిలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వ్యర్థాలను వెంటనే తొలగించాలని, ఎలాంటి నిర్లక్ష్యం చేయొద్దన్నారు. బస్తీదవాఖానాలు, అన్నపూర్ణ సెంటర్లను పరిశీలించారు. అవసరం ఉన్న ప్రాంతాల్లో అన్నపూర్ణ కేంద్రాలను మరిన్ని ఏర్పాటు చేసేందుకు అధికారులను ఆదేశించారు. బయోడైవర్సిటీ, కొత్తగూడ కూడలి, రాడిసన్‌హోటల్ రోడ్డు, మసీద్‌బండ, కొండాపూర్ హైటెక్‌సిటీ, గచ్చిబౌలి ప్రాంతాల్లో ఆయా విభాగాల అధికారులతో కలి సి పరిశీలించారు. అన్ని కూడలిలో నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని మరింత మెరుగుపరచాలని అధికారులకు సూచించారు. రోజువారీ పారిశుధ్య నిర్వహణ పనులు ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కూడళ్లను పరిశీలిస్తున్న జడ్‌సీ ఉపేందర్‌రెడ్డి

రేషన్‌కార్డులు ఇవ్వాలని ఏఎస్‌వోకు సీపీఎం వినతి

బాలానగర్, జూలై 16(ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్ కార్డులను వెంటనే మంజూరు చేయాలని సీపీఎం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ నాయకుడు ఐలాపురం రాజశేఖర్ ఆధ్వర్యంలో సీపీఎం నాయకులు బాలానగర్ అసిస్టెంట్ సివిల్ సప్లై అధికారి శ్రీనివాస్‌కు వినతిపత్రం మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు శంకర్, సతీష్, భాగ్యలక్ష్మి, భారతి, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.



ఏఎస్‌వోకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

పేదల ఇళ్లకు ఇచ్చిన నోటీసులను ఉపసంహరించుకోవాలి

మియాపూర్, జూలై 16(ఆంధ్రజ్యోతి): మియాపూర్ ఎంఏనగర్‌లో పేదల ఇళ్లకు ఇచ్చిన నోటీసులను ఉపసంహరించుకోవాలని హెచ్ఎండీఏ అధికారులకు మంగళవారం ఎంసీపీఐ(యు) నాయకులు వినతిపత్రం అందజేశారు. అమీర్‌పేటలోని హెచ్ఎండీఏ అధికారులకు వినతిపత్రం ఇచ్చి 35 సంవత్సరాల నుంచి నివాసం ఉంటున్న పేదలకు నోటీసులు ఇవ్వడంతో భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఏళ్ల తరబడి అక్కడే ఉంటున్న వారికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనిల్‌కుమార్, వనం సుధాకర్, వర్ల ఇస్లావత్ దశరథ్‌నాయక్, తాండ్ర కళావతి, పుష్ప, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు వినతిపత్రం ఇస్తున్న ఎంసీపీఐ(యు) నేతలు

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి



చిన్నారులతో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీ టీచర్లు

పేట్‌బషీరాబాద్, జూలై 16(ఆంధ్రజ్యోతి): చిన్నారులను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'అమ్మమాట.. అంగన్వాడీ బాట' కార్యక్రమంలో భాగంగా మంగళవారం రంగారెడ్డినగర్ డివిజన్‌లోని గిరినగర్ ప్రాంతంలోని 1, 2, 3 అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో గిరినగర్, చెన్నారెడ్డినగర్, బాబూజగ్జీవన్‌రామ్ నగర్‌ల్లో చిన్నారులు, వారి తల్లుల ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఎన్ నీరజ, నసీమా, కె.వాణి, పీసీ సునీత, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

● **ఐదో వార్డులో..**

కొంపల్లి పురపాలక సంఘంలోని 5వ వార్డులో అమ్మమాట.. అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమాన్ని మంగళవారం కాలనీల్లో నిర్వహించారు. అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, పిల్లలు ర్యాలీ నిర్వహించారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

అల్లాపూర్, జూలై 16(ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్‌కు సంబంధించిన పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు మంగళవారం పంపిణీ చేశారు. కూకట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే, అల్లాపూర్ కార్పొరేటర్ సబీహ బేగం, తహసీల్దార్ లబ్ధిదారులకు అందజేశారు.

● **కేపీహెచ్‌బీకాలనీ:** కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన 235 మంది లబ్ధిదారులకు మంగళవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చెక్కులను పంపిణీ చేశారు. కేపీహెచ్‌బీలోని తహసీల్దార్ కార్యాలయంలో రూ.100,116ల చెక్కులను కార్పొరేటర్లు మందడి శ్రీనివాసరావు, సతీష్‌గౌడ్, నర్సింహయాదవ్, రవీందర్‌రెడ్డి, సదేహ గౌసుద్దీన్, శిరీష, మహేశ్వరీలతో కలిసి ఎమ్మెల్యే కృష్ణారావు లబ్ధిదారులకు అందజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే సూచించారు.



కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి: డీసీపీ

పేట్‌బషీరాబాద్, జూలై 16(ఆంధ్రజ్యోతి): అందరూ మొక్కలు నాటాలని, అవి పెరిగి పెద్దవై, మానవాళికి ఉపయోగపడతాయని మేడ్చల్ జోన్ డీసీపీ ఎన్ కోటిరెడ్డి అన్నారు. మంగళవారం పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో విద్యార్థులు తీసుకొచ్చిన మొక్కలను ఏసీపీ రాములు, సీఐ విజయ్‌వర్ధన్‌తో కలిసి నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు ప్రకృతిపై మమకారం పెంచేలా తల్లిదండ్రులు ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు ప్రవీణ్‌కుమార్, ధర్మేష్, రామ్‌నారాయణ, సురేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

● **రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్**

మేడ్చల్ జోన్ పోలీస్‌స్టేషన్‌ల్లో నమోదైన రౌడీషీటర్లతో మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి డీసీపీ కార్యాలయం ఆవరణలో సమావేశమై వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. సత్ప్రవర్తనతో మెలగాలని వారికి సూచించారు. కార్యక్రమంలో మేడ్చల్, పేట్‌బషీరాబాద్ ఏసీపీలు శ్రీనివాస్‌రెడ్డి, రాములు, మేడ్చల్ జోన్ ఎస్ఓటీ సీఐ శ్యామ్‌సుందర్‌రెడ్డి, సీఐలు విజయ్‌వర్ధన్, రాహుల్‌దేవ్, ఎస్ఐలు పాల్గొన్నారు.



పోలీస్ స్టేషన్‌లో మొక్కలు నాటిన డీసీపీ కోటిరెడ్డి

లేబర్ సెల్ కూకట్‌పల్లి నియోజకవర్గ అధ్యక్షుడిగా భాస్కర్

బాలానగర్, జూలై 16(ఆంధ్రజ్యోతి): టీపీసీసీ లేబర్ సెల్ కూకట్‌పల్లి నియోజకవర్గ అధ్యక్షుడిగా సప్పిడి భాస్కర్ నియమితులయ్యారు. మంగళవారం నగరంలోని ప్రైవేటు ఫంక్షన్ హాలులో జరిగిన సమావేశంలో టీపీసీసీ లేబర్ సెల్ రాష్ట్ర చైర్మెన్ ఆర్.ప్రకాష్‌గౌడ్ భాస్కర్‌కు నియామకపు పత్రాన్ని అందజేశారు. చైర్మన్ ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ.. పదవులకే పరిమితం కాకుండా కార్మిక భద్రత, కార్మికుల చట్టాలను కార్మికులకు వివరించాలని సూచించారు. భాస్కర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కర్క నాగరాజు, శ్రీధర్, వినీత్, అఖిలేష్, వీరేష్, మహేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని

పరిశోధనలో జవాబుదారీతనం అవసరం

పటాన్‌చెరు రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పరిశోధనలో జవాబుదారీతనం అవసరమని, పరిశ్రమ అవసరాలను అర్థం చేసుకుని, ఆచరణాత్మక పరిష్కారాలను అభివృద్ధి చేయడంపై దృష్టి సారించాలని బాబా అణు పరిశోధనా సంస్థ పూర్వ శాస్త్రవేత్త, ముంబై విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ కె.ఇందిరా ప్రియదర్శిని సూచించారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లోని రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సాంకేతిక శాస్త్రం అభివృద్ధికి ప్రాథమిక పరిశోధన, రసాయన, జీవశాస్త్రాల సమన్వయంలో సవాళ్లు, అవకాశాలు అనే అంశంపై మంగళవారం ఆమె అతిథ్య ఉపన్యాసం చేశారు. రసాయన, జీవశాస్త్ర రంగాలలో ప్రాథమిక పరిశోధన, సాంకేతిక అభివృద్ధిపై ఆమె విలువైన అంతర దృష్టిలను అందించడంతో పాటు కర్క్యుమిన్, సెలినియంలపై తన పరిశోధనా ఫలితాలను సదస్సులో పంచుకున్నారు. పరిశోధకులు సృజనాత్మకంగా యోచించాలని, ప్రాజెక్టులను ఇతరుల సహకారంతో చేపట్టాలని ఆమె సూచించారు. తొలుత, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గౌసియా బేగం అతిథిని సదస్యులకు పరిచయం చేసి, ఇతర సహోధ్యాసకులతో కలిసి సత్కరించారు. తరువాతి తరం పరిశోధకులను వినూత్నంగా ఆలోచించేలా, పనిలో శ్రేష్ఠత కోసం ప్రయత్నించేలా ప్రేరేపించేలా సాగిన ఈ ఆతిథ్య ఉపన్యాసంలో పలువురు అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అదనపు కట్నం వేధింపులకు గృహిణి బలి



అరుణ (ఫైల్)

నిజాంపేట్, జూలై 16(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం భర్త పెట్టే వేధింపులకు తాళలేక గృహిణి ఆత్మహత్య చేసుకుంది. బాచుపల్లి సాయి నగర్‌లో నివాసం ఉండే యార్లగడ్డ గోపి, సుంకరి అరుణ(26)లకు ఆరు సంవత్సరాల క్రితం పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. వివాహ సమయంలో కట్నం కింద బంగారం, నగదు, గృహోపకరణాలు ఇచ్చారు. ఇద్దరు పిల్లలు పుట్టిన తరువాత నుంచి అదనపు కట్నం తీసుకురావాలని గోపి అరుణను నిత్యం వేధించేవాడు. ఈ నేపథ్యంలోనే ఈనెల 15న రాత్రి ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. తీవ్ర మనస్తాపానికి గురైన అరుణ అందరూ నిద్రపోయిన సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. భార్య మృతి చెందిన విషయాన్ని గోపి మంగళవారం తెల్లవారుజామున అరుణ కుటుంబసభ్యులకు ఫోన్ ద్వారా తెలియపరిచాడు. మృతురాలి తల్లిదండ్రులు ఊరు నుంచి రావడం ఆలస్యం కావడంతో మృతదేహాన్ని బాచుపల్లి పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. తరువాత వచ్చిన అరుణ తల్లిదండ్రులు తమ కూతరు మరణానికి గోపి వేధింపులే కారణమని బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గృహిణి అదృశ్యం



మేఘని

పేట్‌బషీరాబాద్, జూలై 16(ఆంధ్రజ్యోతి): పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో గృహిణి అదృశ్యమైంది. ఈ సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. అడ్మిన్ ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కొంపల్లి పురపాలక సంఘంలోని గార్డెన్ సొసైటీ, ఫ్లాట్‌నెం-బి 16లో అమిరాలి మేఘని(38) ఈనెల 15వ తేదీ సాయంత్రం సొసైటీలో వంట పని చేసేందుకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె కోసం కుటుంబసభ్యులు బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినా ప్రయోజనం లేదు. దీంతో కుటుంబీకులు పేట్‌బషీరాబాద్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పదికిలోల గంజాయి చాక్లెట్‌ల స్వాధీనం

జీడిమెట్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని లెనిన్‌నగర్‌లోని ఓ కిరాణా దుకాణంలో గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్న నిషేధిత గంజాయి చాక్లెట్‌లను బాలానగర్ ఎస్ఓటీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం రాత్రి కిరాణా షాపులపై అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పది కిలోల గంజాయి చాక్లెట్‌లను స్వాధీనం చేసుకున్నారు. షాపు నిర్వాహకురాలు సునీతాదేవిగోస్వామి(43)ని అరెస్టుచేసి జగద్గిరిగుట్ట పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఎమ్మెల్యే గాంధీని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

వివేకానందనగర్‌కాలనీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని కూకట్‌పల్లి, చందానగర్ డివిజన్లకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే గాంధీని ఆయన నివాసంలో కలిసి మంగళవారం సన్మానించారు. ఎల్లం నాయుడు, లక్ష్మీనారాయణ, కల్పన, యాదగిరిరెడ్డి, ప్రసాద్, సత్యనారాయణ రెడ్డి, శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

● **ధ్వంసమైన నాలా పరిశీలన**

చందానగర్ : చందానగర్ జాతీయ రహదారికి అనుకుని ఉన్న సర్వీస్‌రోడ్డులో ఇటీవల కురిసిన వర్షాలకు నాలా ధ్వంసమైంది. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ దృష్టికి తీసుకువెళ్లారు.

బోనాల ఉత్సవాల చెక్కుల పంపిణీ

మియాపూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బోనాల దశాబ్ది ఉత్సవాల కోసం ప్రభుత్వం మంజూరు చేసిన నిధులకు సంబంధించిన చెక్కులను మియాపూర్ మయూరినగర్ ధ్యాన మారుతీ ఆలయంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ ఆలయాల కమిటీ ప్రతినిధులకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భవిష్యత్ తరాలకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాలను చాటిచెప్పేలా పండుగలను నిర్వహించుకోవాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రజలు బోనాల ఉత్సవాలు జరుపుకునేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శేఖర్, ఈవో అరుణకుమారి, మాజీ కౌన్సిలర్లు మోహన్‌గౌడ్, రవీందర్‌రావు, నాయకులు శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

● **బోనాల ఏర్పాట్లపై సమీక్ష**

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలో నిర్వహించనున్న బోనాల పండుగ ఏర్పాట్లపై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కూకట్‌పల్లిలోని చిత్తారమ్మ ఆలయంలో సమీక్ష నిర్వహించారు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సదుపాయాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, చిన్న తులసీ, పాల్గొన్నారు.

● **చెక్కుల పంపిణీ నేడు**

బాలానగర్: బోనాల వేడుకలను వైభవంగా జరుపుకునేందుకు సీఎం రూ.25 కోట్ల నిధులను విడుదల చేయడం హర్షణీయమని కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్, ఏ బ్లాక్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి తెలిపారు. కూకట్‌పల్లి నియోజక వర్గంలో ఉన్న సుమారు 108 అమ్మవారి ఆలయాలకు బుధవారం ఉదయం 10 గంటలకు కూకట్‌పల్లి రామాలయం వద్ద చెక్కుల పంపిణీ ఉంటుందని వారు ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

● **పూజల్లో మాజీ కార్పొరేటర్**

బాలానగర్: డివిజన్ పరిధిలోని దామోదర సంజీవయ్యనగర్‌లోని నల్లపోచమ్మ ఆలయంలో జరిగిన పూజల్లో మాజీ కార్పొరేటర్ గొట్టిముక్కల వెంగళరావు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

